RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్


తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 279 | గురువారం, మార్చి 19 2026 | ఎడిటర్ : బత్తుల లక్ష్మీనారాయణ | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,




పాఠకులకు,ప్రకటన కర్తలకు, శ్రేయేభిలాషులకు, మిత్రులకు మరియు విలేకరులకు శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరాది

## ఉగాది శుభాకాంక్షలు

పండుగ సంధర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున రేపు ( శుక్రవారం ) పత్రిక వేలువడదు. తిరిగి పునర్ధర్శనం శనివారం

- ఎడిటర్ -

## మూసీ ప్రాజెక్టుపై అధికార, ప్రతిపక్ష

# ఎమ్మెల్యేల వాదోపవాదాలు

**హైదరాబాద్ :** మూసీ నది పునరుజ్జీవం ప్రాజెక్టుపై ఇవాళ శాసనసభలో వాడీ వేడి చర్చ జరిగింది. ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, ప్రభుత్వ దోపిడీకి మాత్రమే తాము వ్యతిరేకమని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. ప్రజల జీవితాలు బాగు పరచాలన్న సంకల్పంతో ఒక యజ్ఞం చేపడుతున్నామని ప్రతిపక్షం ప్రతి దానికీ అడ్డుపడడం తగదని ప్రభుత్వం తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తన వైఖరి మార్చు కోవాలని, సభలో పూర్తి స్థాయి చర్చకు తాము సిద్ధమని ప్రకటిం చింది. మంత్రి శ్రీధర్‌బాబు సమాధానాలపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య చర్చ ఆసక్తికరంగా జరిగింది. మూడోరోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల సమయం చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితర సభ్యులు మాట్లాడారు. బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు మూసీ ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీ ఆర్ సిద్ధమైందని, రూ. 6 వేల కోట్ల నుంచి రూ. 7 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. సుమారు 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తుది ఎన్యుమరేషన్ ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు.

**మూసీని మురికికూపం చేసిందే కాంగ్రెస్ :** మూసీ ప్రాజెక్టుపై తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా మంత్రులు దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం





వ్యక్తం చేశారు. మూసీని మురికికూపంగా మార్చిందే కాంగ్రెస్ పార్టీ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై కేటీఆర్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కొంత సంవాదం జరిగింది. మూసీ అభివృద్ధి కాకూడదని ప్రతిపక్షం కోరుకుంటోందని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. మూసీ ప్రజలు మురికి కూపంలో బతకాలనే ప్రతిపక్షం కోరిక సరైనది కాదన్నా రు."మూసీ పరివాహక ప్రజలు అపరిశుభ్రత వాతావరణంలో జీవిస్తున్నారు. మూసీ ప్రజల జీవనగతులు మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. మూసీ అభివృద్ధి కాకూడదని ప్రతిపక్షం కోరు కుంటుందా? నగరానికి మణిహారంగా మూసీని మార్చాలని ప్రయత్నిస్తున్నాం. మూసీ పరివాహక ప్రజలకు పునరావాసం కల్పిస్తామని చెప్పాం. మూసీ ప్రజలు మురికికూపంలో బతకా లనేదే ప్రతిపక్షం కోరిక. 18 నెలలో తయారవుతుందన్న మూసీ డీపీఆర్ రెండు నెలల్లోనే ఎలా తయారైందని మాజీ మంత్రి కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఒకవేళ డీపీఆర్? పూర్తైయి ఉంటే సభ ముందు ప్రవేశపెట్టాలని కోరారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని పేదల ఇళ్లు కూల్చకుండా అభివృద్ధి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన శ్రీధర్‌బాబు డీపీఆర్ రెండు నెలల్లో పూర్తి కాలేదని తెలిపారు. 2024 డిసెంబర్‌లో మెయిన్ హార్ట్ అనే సంస్థకు బాధ్యతలు అప్ప గించగా, 2026 ఫిబ్రవరిలో ఆ సంస్థ ప్రభుత్వా నికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

**ఆ విషయాలు చెబితే సభలో కూడా ఉండరు :** ఫైవ్ స్టార్ హోటల్‌లో కాకుండా మూసీ బాధితుల సమక్షంలో ప్రజెంటేషన్ పెట్టాలని తాము కోరామని, కానీ ప్రభుత్వం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో నిర్వ హించడం వల్ల ఆ కార్యక్రమానికి రాలేదని కేటీ ఆర్ తెలిపారు. పేదలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రేమ వలక బోస్తు న్నారని, ఖమ్మం పట్ట ణంలో వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చా రని ఆక్షేపించారు. మూసీ ప్రజలు మురికికూపంలో బతకాలనే ప్రతిపక్షం కోరిక సరైనది కాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆక్షేపించారు. వెలుగుమట్ల అంశంపై చర్చకు సిద్ధమన్న మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్ని విషయాలు వెలుగులోకి వస్తే గులాబీ నేతలు సభలో కూడా ఉండలేరని ఎద్దేవా చేశారు.

## రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు
## రాజ్యసభలో ప్రధాని మోదీ

**న్యూ ఢిల్లీ :** రాజకీయాల్లో విరమణ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపుని చ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవ ారికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోదీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు."సభలో వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. వాటిలో ప్రతి సభ్యుడు ఒక ప్రత్యేక పాత్ర పోషి స్తారు. కొన్ని మంచితో పాటు చెడు అనుభవాలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లోనే పార్టీలకతీతంగా అందరిలో పరస్పర గౌరవ భావం ఏర్పడుతుంది. తమ పదవీ కాలం ముగిసి సభను వీడుతున్న సభ్యులకు నేను ఒక్కటి చెప్పాలనుకుంటున్నా. రాజకీయాల్లో ఎప్పుడు ముగింపు ఉండదు. మీ అనుభవాలు,



మీ సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.', ప్రధానమంత్రికొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచనహెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యు డు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ కూడా హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అం శాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు.

### తెలంగాణ శాసనసభ నుంచి
## బీఆర్ఎస్ వాకౌట్



**హైదరాబాద్, మార్చి 18:** తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా మూసీ నది ప్రాజెక్ట్‌పై తీవ్ర చర్చ జరిగింది. మూసీ పేరిట దోపిడీ జరుగుతోందంటూ సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. 'మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు.. ప్రాజెక్ట్ పేరుతో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకం. ఆ దోపిడీకి నిరసనగా మేము వాకౌట్ చేస్తున్నాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. డీపీఆర్ లేదని ఎండీ చెప్పారని, కానీ ప్రభుత్వం ఉందని చెబుతోందని ఆరోపించారు. పేదవాళ్లపై ప్రేమను ఒలకబోస్తున్నారని మాజీ మంత్రి అన్నారు. వెలుగుమట్లలో పేదల ఇళ్లను కూల్చేశారంటూ మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. 'డీపీఆర్ తయారైందని ఎండీ నరసింహారెడ్డి స్పష్టంగా చెప్పారు.

## పోలవరం ప్రారంభానికి ముందే
# నిర్వాసితులకు న్యాయం

**అమరావతి, మార్చి 18:** పోలవరం ప్రాజెక్ట్ ము ంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (బుధవారం) సమావేశం నిర్వహించారు. పునరావాస పరి హార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వా సితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అంది ంచారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోల వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రయో జనాలు చేకూరతాయని తెలిపారు. గత పాల కులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వర దల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. రూ.226.6 కోట్లు జమప్రాజెక్ట్ కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ. 800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడ తగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తు చేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వా సితులకు



మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి స్థలం కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు

## రింగ్ మాస్టర్లుగా అధికారులు
### కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మార్చి 18:** ప్రభుత్వ అధికారులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వాన్ని సర్కస్‌లా నడిపిస్తున్నారని. అధికారులు రింగ్ మాస్టర్లుగా తయారయ్యారని అన్నారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ అధికారి, ఐఏఎస్ నర్సింహారెడ్డి.. కాంగ్రెస్ లీడర్‌లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మూసీ ప్రాజెక్ట్‌ను ఆరు నూరైనా పూర్తి చేసి తీరుతామని అనడానికి నువ్వెవరివి?' అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని హెచ్చరించారు. అధికారులు రిటైర్ అయినా వారిని వదిలిపెట్టేది లేదన్నారు. ప్రభుత్వాన్ని తప్పుడు పనులకు ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. 'కుక్క తోకను ఊపట్లేదు.. తోకే కుక్కను ఊపుతున్నట్లుంది అధికారులు, మంత్రుల తీరు' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంకా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై విరుచుకుపడ్డారు. 57 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని భట్టి సభలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 'అది నిజమని నిరూపిస్తే రాజీనామా చేస్తాను. నేను ఇప్పటికీ ఆ మాటకు కట్టుబడి ఉన్నాను' అని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్‌పై సభలో మంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. మూసీ సంబంధించిన డీపీఆర్‌ను అసెంబ్లీలో పెట్టాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదు,
### ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇళ్లు ఇస్తాం



**హైదరాబాద్, మార్చి 18:** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. శాసన మండలిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, మంజూరు సమస్యలపై ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, మధుసూధనాచారి ప్రశ్నలు అడిగారు. టాటా ఏస్ లాంటి కిరాయి వాహనం నడుపుకుంటే ఫోర్ వీల్స్ వాహనం కింద లెక్కేసి ఇందిరమ్మ పథకానికి అనర్హుడని చెబుతున్నారని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్లు కట్టుకున్న ఇళ్లను అనుమతించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు.

**పేద ప్రజలకు ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం : కాంగ్రెస్** పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి 4 లక్షల 50 వేల చొప్పున నిర్మిస్తాం అని చెప్పిందని, మరి ఆ విధంగా ఆ హామీ అమలు కావడం లేదని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా దానికి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో అవకవతవకలు జరుగుతున్నాయని కలెక్టరేట్ల ముందు అర్హులు ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమాధానమిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికల హామీ కాదని, ప్రజా పాలనలో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3,24,593 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# హామీలు నెరవేర్చలేదంటూ బీజేపీ ఆందోళన వినతిపత్రం సమర్పణ

**- హామీలు నెరవేర్చలేదంటూ బీజేపీ ఆందోళన వినతిపత్రం సమర్పణ**
**- రైతు భరోసా నుంచి డబుల్ బెడ్‌రూమ్ వరకు అమలు ఎక్కడ**
**- మండల బిజెపి అధ్యక్షుడు జరుపుల విజయ నాయక్ ఆధ్వర్యంలో**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 18:-రంగారెడ్డి జిల్లా యాచారం మండలం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, బీజేపీ నాయకులు మండల స్థాయిలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా కీలక సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల బీజేపీ అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి "ఆర్ ఐ" కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాషా, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ రైతు భరోసా, వృద్ధాప్య పింఛన్లు, నిరుద్యోగ భృతి, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, మహిళలకు భరోసా, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వంటి ముఖ్య హామీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించలేకపోతే వెంటనే పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండా మధుకర్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగిని యాదయ్య, ఆంబోజి జగదీశ్ యాదవ్, గోగికర్ రమేష్, దెరంగుల రాజు, తాండ్ర రవీందర్, సర్పంచులు ఆంబోజి రమేష్, బాలరాజు, రాయకంటి విజయ్ కుమార్, అలాగే ఉపసర్పంచులు, వార్డ్ సభ్యులు, గ్రామాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలంటూ జోనల్ కార్యాలయం ముట్టడించిన బీజేపీ నాయకులు




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్18:-రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. జిల్లా బీజేపీ అధ్యక్షుడు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో, హయత్‌నగర్ బి.ఎన్.రెడ్డి డివిజన్‌ల తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, మొద్దు లచ్చి రెడ్డి కలిసి జోనల్ కమీషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రచారం చేసిన ఆరు గ్యారంటీల అమలులో స్పష్టత లేకపోవడం ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెన్షన్ లబ్ధిదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని, పేదలకు నిర్మించాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఆలస్యం అవుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని, హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

అదేవిధంగా హయత్‌నగర్ పరిధిలో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, ప్రాథమిక సదుపాయాల లోపం తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పంది ంచకపోతే బీజేపీ తరఫున మరింత ఉద్ధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్‌తో పాటు హయత్‌నగర్, వనస్థలిపురం, బి.ఎన్.రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్‌ల అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కటకం క్రాంతి, హరీష్, విష్ణు తదితర నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలం కోసం కలిసొచ్చిన చేతులు గాయపడిన జర్నలిస్టుకు 65 వేల సహాయం

**-గాయపడిన జర్నలిస్టుకు అండగా నిలిచిన మీడియా కుటుంబం**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 18:-ఇబ్రహీంపట్నంలో జర్నలిస్టుల ఐక్యత మరోసారి చాటుకుంది. బిగ్ టీవీ జర్నలిస్టు ముచర్ల నగేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆయనను పరామర్శించిన స్థానిక జర్నలిస్టులు మరియు ఙఖఔజీ (ఎ-143) యూనియన్ సభ్యులు కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో మొత్తం ?65,000/- సహాయం నగేష్‌కు అందించబడింది. గాయపడి చికిత్స పొందుతున్న నగేష్‌కు ఈ సహాయం ఒక పెద్ద మద్దతుగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సాక్షి చండీశ్వర్ (జిల్లా నాయకులు), నియోజకవర్గ అధ్యక్షుడు సూరమోని సత్యనారాయణ, జిల్లా నాయకులు వరికుప్పల అశోక్, చెరుకూరి రాజు, చెరుకూరి మహేందర్, సూరమోని బాబు, హనుమంతు సుదర్శన్, రాఘవేందర్, విజయ్, కుమార్, రామ్ చందర్, నరేందర్, నరేందరెడ్డి, భూచక్రం గౌడ్, మహేష్ చారి తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టు సంఘం విజ్ఞప్తికి స్పందిస్తూ పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి 25,000/- అందించగా, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు ?10,000/- సహాయం చేశారు. అదేవిధంగా స్థానిక జర్నలిస్టులు కలిసి ?30,000/- సమకూర్చారు. జర్నలిస్టుల ఐక్యత, పరస్పర సహకారం సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇస్తుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలిపారు.

# మార్చి 31లోపు 2బీహెచ్‌కే ఇండ్లలో నివాసం తప్పనిసరి

**- లేని పక్షంలో రద్దు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి హెచ్చరిక**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 18:-రంగారెడ్డి జిల్లా, జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ (2బీహెచ్‌కే) ఇండ్ల కేటాయింపుల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇండ్లు పొందిన లబ్దిదారులు తప్పనిసరిగా తమకు కేటాయించిన ఇళ్లలో నివసించాలని, లేకపోతే వాటిని రద్దు చేసి కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని హెచ్చరించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరం నుండి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన నిర్మాణ దశలో ఉన్న 2బీహెచ్‌కే ఇండ్లకు అర్హులైన లబ్దిదారులను త్వరితగతిన ఎంపిక చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 జాబితా నుంచి పేదలను ఎంపిక చేసి, ఆ జాబితాను మంత్రి ఆమోదంతో గజిటెడ్ అధికారుల ధృవీకరణ అనంతరం మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఇప్పటికే ఇండ్లు పొందిన వారు మార్చి 31లోపు తమ ఇళ్లలో నివాసం ప్రారంభించాలనీ, ఏవైనా సమస్యలు ఉంటే వ్రాతపూర్వకంగా తెలియజేయాలనీ సూచించారు. గడువు పూర్తైన తర్వాత కూడా నివాసం ప్రారంభించని లబ్దిదారుల ఇండ్లను ఏప్రిల్ మొదటి వారంలో రద్దు చేసి, కొత్త అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని హౌసింగ్ కాలనీల్లో విద్యుత్, త్రాగునీరు, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందించాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు ఇచ్చారు. మిగిలి ఉన్న ఎల్2 జాబితా కోసం ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇంకా కాలనీల్లో ఉన్న దుకాణాలను వేలం వేసి వచ్చిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు. అధికారులంతా నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో పని చేసి లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. చాంప్లా నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీజన్ మొదలైనా సరఫరా తగ్గింది మార్కెట్లో మామిడి 'హై వోల్టేజ్' రేట్లు

**- ఉగాది పచ్చడి ఖరీదు పెరిగింది మామిడికాయలు సామాన్యుడికి దూరం**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్18:- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం: ఉగాది పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, పరిసర ప్రాంతాల మార్కెట్లలో మామిడికాయల సీజన్ ప్రారంభమైనప్పటికీ, సరఫరా తక్కువగా ఉండటంతో ధరలు పెరిగాయి. సాధారణంగా ఈ సమయంలో విరివిగా లభించే మామిడికాయలు ఈసారి మార్కెట్లో కొరతగా కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం కిలో మామిడికాయ ధర సుమారు రూ.50 వరకు పలుకుతుండటంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉగాది పచ్చడిలో మామిడికాయ ప్రధాన పాత్ర పోషించడంతో, ధరలు ఎక్కువైనా ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతుల ప్రకారం, ఈ ఏడాది వాతావరణ మార్పులు, పంటపై ప్రభావం చూపడం వల్ల దిగుబడి తగ్గింది. దీంతో మార్కెట్లో సరఫరా తగ్గి, డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు, రానున్న రోజుల్లో మామిడికాయల రాక పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. సరఫరా పెరిగితే ధరలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు

# కాంగ్రెస్ వైఫల్యాలపై బిజెపి గర్జన కమిషనర్‌కు వినతి పత్రం సమర్పణ



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్18:-ఇబ్రహీంపట్నం, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకులు ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలను మోసం చేసే విధానాలకు ముగింపు పలుకుతూ, ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనిపై బిజెపి ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయిని సత్యనారాయణ (మాజీ కౌన్సిలర్), సిద్ధం భానుప్రియ శివ (18వ వార్డు కౌన్సిలర్), జెనిగా శ్రీనివాస్ యాదవ్ (మున్సిపల్ ప్రధాన కార్యదర్శి), రూపక్ సాగర్, లింగం శ్రీకాంత్ (దీజేవీ జిల్లా నాయకులు), బసువపురం గోవర్ధన్ (కిసాన్ మోర్చా మున్సిపల్ అధ్యక్షులు), శేషిధర్ రెడ్డి (దీజేవీ మున్సిపల్ అధ్యక్షులు), రజిత (మహిళా మోర్చా అధ్యక్షురాలు), చెరుకు సురేష్, మైలారం శివ (ఉపాధ్యక్షులు), నౌస్ దాసు (మాజీ ఎాజ మోర్చా అధ్యక్షులు), కొప్పు సతీష్, జోర్రిగాల అశోక్, సాయిలు, పుట్ట జగదీష్ తదితర నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా, బిజెపి కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.

# కచ్చీర్ కాడి ముచ్చట్లు



ధైర్యం లేనిదే ఏ వ్యక్తి నాయకుడుగా ఎదగడు
త్యాగము లేనిదే ఏ సమాజమూ బాగుపడదు !!
కలిసి పోరాడితేనే అన్నింటినీ సాధించుకోగలుగుతాం!!
రండి! కలిసి పనిచేద్దాం సమస్యలు పరిష్కరించుకుందాం !!!
మూర్ఖత్వం వలన మునిగి పోతాం !
దాతృత్వముతో సంఘటిత మవుదాం!

"స్వార్థంతో నయవంచన చేస్తూ ఎదగడం గొప్పకాదు..ఉన్నంతలో ఇతరులకు సాయపడే మానవత్వ గుణం కలిగి ఉండడం గొప్ప..అన్నింటి కన్నా మించి మనిషిగా బతకగలగడం గొప్ప.."తుడుచుకుంటే కన్నీళ్లు చెరిగిపోతాయేమో కానీ... కన్నీటికి కారణమైన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికి చెరిగిపోవు.."

పగను మోయడం వలన అది మనల్ని బలవంతులను చేయదు. అది మనల్ని బలహీనులుగా చేస్తుంది. క్షమించడం అనేది మనల్ని బలహీనులుగా చేయదు, అత్యంత శక్తివంతులను చేస్తుంది అది మనకు స్వేచ్ఛను, ప్రశాంతతను,ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఏదీ మనకు చెప్పి జరగదు.! ఒకవేళ జరిగిందే అనుకో... దానిని మార్చడం మనవల్ల అయ్యే పనికాదు.!

గతాన్ని తవ్వొద్దు.! బాధపడొద్దు.! అని నేను చెప్పను... "ఏడుద్దాం".!! బాధపోయేదాకా.! మరో ఉదయం వచ్చేదాకా.! కానీ, ఎక్కడా ఆగొద్దు అని మాత్రమే చెప్తున్నా..!!

మన తెలివితేటలను
మన బ్రతుకు
బాగు చేసుకోవడానికో....
ఇతరులకు సహాయం చేయడానికో .....
ఉపయోగ పడాలి...
కానీ
ఇతరుల బ్రతుకు
నాశనం చేయడానికి కాదు ...
చెప్పాల్సింది చాలావుంది..
చదవాల్సింది మిగిలే ఉంది....

సకినాల సుధాకర్ పటేల్
సీనియర్ జర్నలిస్ట్

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# చరిత్రలో దళిత చైతన్యానికి క్రాంతి రేఖగా నిలిచిన మహాకవి కుసుమ ధర్మన్న గారు

## – రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్ట వరప్రసాద్

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ :** తెలుగు సాహిత్య చరిత్రలో దళిత చైతన్యానికి ప్రథమ కాంతిరేఖగా నిలిచిన మహాకవి కుసుమ ధర్మన్న గారి సాహిత్య వారసత్వం యుగయుగాల పాటు సమాజాన్ని చైతన్యపరుస్తూనే ఉంటుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు.తెలుగు పండిత దర్శిని వంటి సాహిత్య వనరులలో ప్రతిఫలించినట్లుగా, కుసుమ ధర్మన్న గారు కేవలం కవి మాత్రమే కాదు --- సమాజంలో శతాబ్దాలుగా కొనసాగిన అంటరానితనం, వివక్ష, సామాజిక అన్యాయాలకు ఎదురు నిలిచిన మహోన్నత యోధుడు. తన కలాన్ని ఆయుధంగా, తన పద్యాలను ప్రజల స్వరంగా మార్చి పీడిత వర్గాల గుండెల్లో స్వాభిమానం జ్వలింపజేసిన మహనీయుడని ఆయన కొనియాడారు."హరిజన శతకం" వంటి ప్రబోధాత్మక రచనల ద్వారా దళితుల జీవనవాస్తవాలను సమాజానికి తెలియజేసి, సమానత్వ సమాజ నిర్మాణానికి మార్గదర్శకత్వం వహించిన మహాకవి కుసుమ ధర్మన్న గారి సేవలు అపూర్వమని తెలిపారు.

ఆయన రచనలు కేవలం సాహిత్యం కాదు అవి ఒక ఉద్యమం, ఒక సామాజిక విప్లవం అని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో న్యాయం, సమానత్వం, మానవ గౌరవం కోసం పోరాడే ప్రతి కార్యకర్త కుసుమ ధర్మన్న గారి ఆలోచనలను ఆచరణలో పెట్టాలన్నారు యువత ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సామాజిక బాధ్యతను గుర్తించుకోవాలని, దళితుల ఆత్మగౌరవ పోరాటానికి ఆయన చూపిన మార్గమే నేటి భారత సమాజానికి శాశ్వత దిక్సూచి అని పేర్కొన్నారు.రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) తరఫున రాష్ట్రవ్యాప్తంగా కుసుమ ధర్మన్న గారి సాహిత్య ప్రచార కార్యక్రమాలు చేపట్టి, ఆయన ఆశయాలను గ్రామస్థాయి వరకు చాటేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

మహాకవి కుసుమ ధర్మన్న గారికి వినమ్ర నివాళులు

# ఆపదలో అండగా మంత్రి, రూ.4 లక్షల ఎల్‌ఓసీతో చిన్నయ్య చారికి ఊరట






**(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్18:-** తరణి భార్గవి, చిన్నయ్య చారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల భారం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డిని సంప్రదించారు. ఈ విషయాన్ని వెంటనే స్పందించిన మర్రి నిరంజన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రూ.4 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు.మంజూరైన ఎల్‌ఓసీని బుధవారం రోజున చిన్నయ్య చారికి అందజేశారు. ఆపద సమయంలో తనకు అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, అలాగే మర్రి నిరంజన్ రెడ్డికి చిన్నయ్య చారి, వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం వల్ల వైద్య చికిత్స కొనసాగించడానికి పెద్ద ఊరట లభించిందని వారు పేర్కొన్నారు.

# మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) :**మండల ఆటో యూనియన్ సభ్యుల కు పరాభవ నామ సంవత్సర ఉగాది శు భాకాంక్షలు ఆటో యూనియన్ అధ్యక్షులు శంబయ్య నాయుడు తెలిపారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతనోత్సాహాన్ని సంతరించుకుంటుందని, అదే నూతనోత్సాహం ప్రజల జీవితాల్లో నిండాలని కోరుకున్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని ఆశించారు. ఉగాది పచ్చడి మాదిరి, జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్థమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సాగునీరు తాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

# బడ్జెట్ లో బీసీలకు రూ.25వేల కోట్లు కేటాయించాలి

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ కో -ఆర్డినేటర్ గుజ్జ సత్యం




**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.25వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ కో -ఆర్డినేటర్ గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి ఏటా రూ.25వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించారని, కానీ ఇంత వరకు రూ.10వేల కోట్లకు మించి కేటాయించడం లేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు కేటాయించిన డబ్బులు కూడా సరిగ్గా ఖర్చు చేయడం లేదని, దీంతో బీసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా తెలంగాణలో బీసీల అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడిందని ఆయన విమర్శించారు. బీసీలకు కొత్త పథకాలు లేవని, విద్యార్థులు ఫీజులు, స్కాలర్షిప్స్ చెల్లించడం లేదని అన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వ్యతిరేక చర్యలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలను విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అణచివేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్లో బీసీలకు రూ.25వేల కోట్లు నిధులు కేటాయించకుంటే బీసీలు సంఘటితంగా ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# మూసీ పునరుజ్జీవంపై బీఆర్ఎస్ 'విష ప్రచారం' కాంగ్రెస్ కౌంటర్ ఫైర్





**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్18:-**ఉప్పల్, మేడ్చల్ జిల్లా: మూసీ నది పునరుజ్జీవం విషయంలో బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ స్థలాన్ని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నీటిని ప్రవహింపజేసి కాలుష్యాన్ని తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు ఉపయోగకరమైన ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలతో గందరగోళం సృష్టించాలనుకుంటున్నారని ఆరోపించారు.ఉప్పల్ భగాయత్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ప్రాంతంపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక శ్రద్ధ ఉందని, భారీగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ నిధులను కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించి అవినీతి పాలన సాగించిందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికంటే దోపిడీకి ప్రాధాన్యం ఇచ్చారని, కేటీఆర్ నేతృత్వంలో అవినీతి పెరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల్లోనే ఉప్పల్ నియోజకవర్గానికి రూ.260 కోట్లకు పైగా, ఎల్బీనగర్‌కు రూ.250 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పించి, తగిన నష్టపరిహారం చెల్లిస్తామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షం మంచి పనిని అభినందించాలే గాని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించకూడదని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటుతో పౌర సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ ప్రతి వార్డుకి ఇళ్లు లక్ష్యం: మంత్రి పొంగులేటి




**(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్ 18:-**హైదరాబాద్: పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒకసారి చేసే కార్యక్రమం కాదని, అది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శాసన మండలిలో హౌసింగ్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతి సంవత్సరం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పట్టణ ప్రాంతాల ప్రతీ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్ల మంజూరు పూర్తికాగా, మిగిలిన విడతలను దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు.రాష్ట్రంలోని గిరిజన తండాలు, గూడాల్లో గతంలో ప్రారంభమై మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు అవసరమైన సడలింపులు ఇచ్చి లబ్ధిదారులకు అనుకూలంగా మార్పులు చేపడతామని పేర్కొన్నారు.లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి వివక్ష ఉండదని, కులం, మతం, రాజకీయ సంబంధం లేకుండా అత్యంత పేదలకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎక్కడైనా లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష ఇళు పూర్తికానున్నాయని, జూన్-జులై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో ఎక్కువ భాగం పూర్తవుతాయని తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకే దగ్గరగా ఇళ్ల నిర్మాణం చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన 2దీఎఖ ఇళ్లను వినియోగించలేకపోయిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.అదేవిధంగా, 2దీఎఖ పథకంలో పెండింగ్ బిల్లుల్లో 99 శాతం ఇప్పటికే చెల్లించామని, మిగిలినవి కూడా త్వరలో చెల్లిస్తామని తెలిపారు. వివిధ దశల్లో ఆగిపోయిన 2దీఎఖ ఇళ్లను పూర్తి చేసి అర్హులైన
పేదలకు అందజేయడానికి 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని
మంత్రి పేర్కొన్నారు.

# పన్నులు వసూలు చేయడంపై చూపిస్తున్న శ్రద్ధను, వీధి శునకాల నియంత్రణపై చూపడం లేదని ప్రశ్నించిన

## – గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్

**ఆంధ్రప్రదేశ్:**ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ మున్సిపల్ యంత్రాంగంపై చేసిన విమర్శలు చాలా తీవ్రమైనవి మరియు వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతు న్నాయి. పన్నుల వసూళ్లపై ఉన్న ఉత్సాహం, ప్రజల ప్రాణర క్షణపై లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి.

### ముఖ్య విమర్శలు – సమస్యలు

- పన్నుల వసూలు జం ప్రజారోగ్యం: ప్రభుత్వం రాయితీలు ఇస్తూ పన్నులు వసూలు చేయడంపై చూపిస్తున్న శ్రద్ధను, వీధి శునకాల నియంత్రణపై చూపడం లేదని విమర్శించారు.
- బాధితుల సంఖ్య: పట్టణంలోని 10వ వార్డులోనే ఇటీవల సుమారు 11 మంది వీధి శునకాల బారిన పడి ఆసుపత్రి పాలవ్వడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది.
- అధికారుల నిర్లక్ష్యం: కౌన్సిలర్లు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని, వారి పదవీకాలం



ముగిసినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

- వ్యాక్సిన్ వైఫల్యం: అధికారులు కుక్కలకు కేవలం వ్యాక్సినేషన్ ఇచ్చి మళ్ళీ అదే ప్రాంతంలో వదలడం వల్ల దాడులు తగ్గడం లేదని ఆయన పేర్కొన్నారు.

శ్రీను నాయక్ డిమాండ్లు

శ్రీను నాయక్ ఈ సమస్య పరిష్కారానికి కొన్ని కీలక సూచనలు చేశారు:

- సుప్రీంకోర్టు ఉత్తర్వుల అమలు: నివాస ప్రాంతాలు, దేవాలయాలు, పాఠశాలలు మరియు ఆసుపత్రుల సమీపంలో కుక్కలు లేకుండా చూడాలి.
- సంరక్షణ కేంద్రాల ఏర్పాటు: వీధి శునకాలను జనావాసాల నుంచి తరలించి, ప్రత్యేక సంరక్షణ కేంద్రాల్లో ఉంచి వాటి యోగక్షేమాలు చూడాలి.
- ప్రజల ఆగ్రహం: అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ సమస్య కేవలం ఒక వార్డుకో లేదా ఒక పట్టణానికో పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ యంత్రాంగం కేవలం ఆదాయంపైనే కాకుండా, పౌరుల కనీస భద్రతపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ప్రతి ఇంట సంతోషం వెల్లివిరియాలి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**– ఉగాది శుభాకాంక్షలతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**

(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్ 18:-రంగారెడ్డి జిల్లా: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తనయుడు, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ప్రజల ఆచార సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఉగాది కేవలం పండుగ మాత్రమే కాకుండా కొత్త ఆరంభాలకు సంకేతమని తెలిపారు. ప్రతి కుటుంబంలో సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని కోరుతూ, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత పెరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి కొనసాగుతుందని, ప్రజల సమస్యల పరిష్కారం తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలతో కలిసిమెలిసి వారి అవసరాలను గుర్తించి, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఇక నూతన సంవత్సరంలో యువతకు మరిన్ని



అవకాశాలు, రైతులకు శ్రేయస్సు, మహిళలకు సాధికారత కలగాలని ఆయన కోరుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఉగాది కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కూడా ప్రశాంత్ కుమార్ రెడ్డి



ఇచ్చిన శుభాకాంక్షలను సంతోషంగా స్వీకరించి, ఆయన ప్రజల పట్ల చూపుతున్న అనురాగాన్ని అభినందించారు.

# బీసీల సంక్షేమానికి రూ. 20 వేల కోట్లు కేటాయించాలి

హైదరాబాద్ : జనాభా లో 50 శాతం ఉన్న బీసీ లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్ లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్ లు అయిపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లిం చాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకా యిల కారణంగా అనేకమంది విద్యార్థులు ఇబ్బ ందులు పడుతున్నారని చెప్పారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసు కొచ్చారని, ఆ పథకం క్రింద అర్హులైన విద్యా ర్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం



చేశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్ధత రాదని, కేంద్ర ప్రభుత్వం 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్ధత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరుకాకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. బీసీ సమస్యల పై కాంగ్రెస్ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

# ఉగాది శుభాకాంక్షలతో ప్రజల గుండెల్లో కొత్త ఆశలు నింపిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్18:- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఉగాది పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది తెలుగు ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నెలకొనాలని కోరుకున్నారు. ప్రజలందరూ సుఖసం తోషాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉగాది మనకు కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు అందించే శుభదినమని, ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఉగాది మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి -- సంతోషం, శాంతి, సమృద్ధి మీ అందరికీ కలగాలి" అని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# మూసీ ప్రక్షాళనకు కాదు లక్షన్నర కోట్ల దోపిడీకే మేం వ్యతిరేకం

హైదరాబాద్ : మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ రోజు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అసెంబ్లీలో మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన పలు కీలక అంశాలపై కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీశారు. ముఖ్యంగా డీపీఆర్ () తయారీ, కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభి న్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచ ూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ



జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# 18 ఏళ్ల నాటి హామీ సాకారం బలిమెల మృతుల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు

హైదరాబాద్ :బలిమెల మృతుల కుటుంబాలకు ఎట్టకేలకు న్యాయం జరిగింది. ఒడిశాలోని బలిమెల రిజర్వాయర్ వద్ద 2008లో జరిగిన ఘటనలో 32 మంది గ్రేహౌండ్స్ సిబ్బంది, ఓ ఎస్పై ప్రాణాలు కోల్పోగా వారి కుటుంబాలకు డీజీపీ శివధర్‌రెడ్డి ఇళ్ల పట్టాలు అందించారు. దీంతో ఆ కుటు ంబాల 18 ఏళ్ల నిరీక్షణకు తెర పడింది. బలిమెల మృతుల కుటుంబాలకు 200 గజాల చొప్పున ఇంటి స్థలం కేటా యించాలని నిర్ణయించిన అప్పటి ప్రభుత్వం 2013లో ఉత్తర్వులు జారీచేసింది. ఆయా బాధిత కుటుంబాలకు కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో భూమి కేటాయించగా భూముల వివాదంతో సమస్యలు తలెత్తాయి. దీంతో రేవంత్ ప్రభుత్వం గత అక్టోబరు 18న సమస్యను పరిష్కరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో బలిమెల బాధితుల సుదీర్ఘ ఎదురు చూపులకు తెరపడినట్లయింది. లాంచీ సిబ్బంది మినహా 33 మంది మృతుల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. బలిమెల ఘటన జరిగినప్పుడు ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఎస్పైబీ డీఐజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన డీజీపీ హోదాలో ఇళ్లపట్టాలు అందజేయడంతో



ఒకింత భావోద్వేగానికి గుర య్యారు. అత్యంత విషాదకరమైన ఘటన. దేశ అంతర్గత భద్రత చరిత్రలో బలిమెల రిజ ర్వాయర్ ఘటన అత్యంత విషాదకరమైనదిగా నిలిచిపోయింది. 2008, జూన్ 29న ఈ విషా దకర ఘటన చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లోని చిత్రకొండ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై సమాచారం అందడంతో.. గ్రేహౌండ్స్ దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో సుమారు 60 మందికి పైగా సిబ్బంది బలిమెల రిజర్వాయ ర్‌ను లాంచీలో దాటుతున్నారు. చుట్టూ కొండలతో నిండి ఉన్న ఆ రిజర్వాయర్ సమీపంలో మావోయిస్టులు ముందస్తు వ్యూహంతో మాటు వేశారు. లాంచీ మధ్యలోకి రాగానే కొండల పైనుంచి ఏకధాటిగా కాల్పులు జరిపారు. మావోయిస్టులు ప్రయోగించిన లైట్ మెషిన్ గన్లు, గ్రెనేడ్ల దాటికి లాంచీ ఒక్కసారిగా నీట మునిగింది. ఈ దారుణ ఘటనలో 32 మంది గ్రేహౌండ్స్ కమాండోలు, ఒక ఎస్పైతో పాటు మొత్తం 38 మంది ప్రాణాలు కోల్పోయారు. నీటిలో చిక్కుకున్న సిబ్బందికి ఎదురుదాడి చేసే అవకాశం కూడా లేకపోవడంతో ప్రాణనష్టం తీవ్రంగా జరిగింది. ఈ ఘటన తర్వాత ప్రభుత్వాలు యాంటీ-నక్సల్ ఆపరేషన్ల వ్యూహాలను పూర్తిగా మార్చేశాయి. నీటి మార్గాల్లో ప్రయాణిం చేటప్పుడు అనుసరించాల్సిన ప్రోటోకాల్స్, కమ్యూనికేషన్ వ్యవస్థలో లోపాలను సరిదిద్దాయి. అమరులైన కమాండోల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం జూన్ 29న వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారు.

# ఉద్యోగులకు ఆర్టీసీ చేదువార్త ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు

హైదరాబాద్ :కార్మికులు, ఉద్యోగులు, అధికారులకు యాజ మాన్యం చేదువార్త చెప్పింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను ఇకపై ఇవ్వకూడదని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ం సర్క్యులర్ జారీ చేసింది. ఇక నుంచి ఆర్టీసీ ఉద్యోగులు , వారి జీవిత భాగస్వామి ఫ్యా మిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా యాజమాన్యం నుంచి ఎటువంటి ఇంక్రిమెంట్ అందదు. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇకపై కొనసాగుతుందని ఆర్టీసీ యా జమాన్యం సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కాగా, ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేయడాన్ని ఆర్టీసీలో కార్మిక సంఘం ఎస్‌డ బ్ల్యూఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఇది కార్మి కులకు అన్యాయం చేయడమేనని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు వీరాంజనేయులు అన్నారు. యాజ మాన్యం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసు కొని ఇంక్రిమెంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఆర్టీసీలో సమ్మె సైరన్. ఇదిలా ఉండగా.



. తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి సమ్మెకు దిగేందుకు సిద్ధ మయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ యాజమాన్యానికి జేఏసీ నేతలు ఇప్పటికే సమ్మె నోటీసులు ఇచ్చారు. గతేడాది కూడా సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధం కాగా.. ప్రభుత్వ హామీతో వెనక్కి తగ్గారు. ఆ తర్వాత సమస్యలు పరిష్కా రం కాకపోటవంతో మరోసారి సమ్మెకు రెడీ అవుతు న్నారు. ఈ మేరకు ఆర్టీసీ కార్మిక సంఘాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ డిమాండ్లను సాధించుకునే వరకు వెనక్కి తగ్గకూడదని కార్మికులు నిర్ణయిం చుకున్నాయి. అందులో భాగంగా.. రెండ్రోజుల క్రితం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి సమ్మె నోటీసులు ఇచ్చారు. రెండు వారాల్లోపు ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరిం చకుంటే సమ్మె తప్పదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరి ంచారుపూర్తిస్థాయిలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కార్మికులు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. దాంతో పాటుగా.. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను రిలీజ్ చేయాలని.. ఆర్టీసీని బలోపేతం చేసేందుకు కొత్త బస్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో సిబ్బంది కొరత ఉందని.. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

# యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో భర్త అరెస్ట్

కోరుట్ల : యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో మిస్టరీ వీడింది. ప్రేమించి పెళ్లాడిన భర్త భార్యను అదనపు కట్నం కోసమే హత్య చేశాడని పోలీసులు నిర్ధారించారు. హత్యకు సంబంధించిన వివరాలను కోరుట్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ బుధవారం వెల్లడించారు. కోరుట్ల మండలంలోని మాదాపూర్‌కు చెందిన గంధం దుర్గా ప్రసాద్, రాణి దంపతుల కూతురు వైష్ణవి కొంతకాలంగా యూట్యూబ్ ద్వారా వీడియోలు రూపొందిస్తూ పేరు తెచ్చుకుంది. 10 నెలల క్రితం కోరుట్లలోని ఏస్కోనిగుట్ట కాలనీకి చెందిన చిత్తరి



హరిబాబుతో స్నేహం కుదిరి అది కాస్తా ప్రేమగా మారింది. హరిబాబు తల్లిదండ్రులు వివాహ విషయమై మాట్లాడేందుకు వచ్చి కట్న కానుకలు ఇవ్వాలని కోరగా, వైష్ణవి తల్లిదండ్రులు కట్నం ఇవ్వలేని స్థితిలో ఉన్నామని తెలిపారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేయాలి

మెదక్, మార్చి 18 : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా నిర్వహించారు. కిసాన్ మేళాకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిసాన్ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులు , వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ ఆధునిక వ్యవసాయం చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా సందర్శించి రైతులతో




ముచ్చటించారు. ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా కిసాన్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ౖతులు, శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ప్రతి బీజేపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు.. పీవీఎన్ మాధవ్ ఆదేశం



**అమరావతి, మార్చి 18:** ఉగాది పర్వదినం సందర్భంగా పార్టీ శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్( దిశానిర్దేశం చేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా నేతలు, కార్య కర్తలతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బీజేపీ కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యాలయంలో పురోహితులను పిలిపించి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా జరగాలని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోని ముఖ్యమైన గ్రామ దేవతలను పార్టీ నాయకులు సందర్శించాలని మాధవ్ సూచించారు. గ్రామ దేవతలకు పార్టీ తరఫున సంప్రదాయబద్ధంగా సారె సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి స్థానిక ప్రజలతో కలిసి ఈ వేడుకలు జరపాలని ఆదేశించారు. కొత్త అమావాస్య, ఉగాది సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు.. ప్రజలతో మమేకమై చేయాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

# ఏపీలో క్రూడాయిల్ నిక్షేపాలు మిషన్ అన్వేషణ్ పేరుతో నాలుగు జిల్లాల్లో సర్వే

**కాకినాడ జిల్లా :** ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ప్రభావంతో గ్యాస్, పెట్రోల్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మనం కూడా వీటి కోసం విదేశాలపై అధారపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అక్కడెక్కడో యుద్ధం జరిగితే.. మన దేశంలో, మన రాష్ట్రంలో సమస్యలు తప్పడం లేదు. అందుకే కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.. దేశవ్యాప్తంగా సహజవాయు నిక్షేపాలను సద్వినియోగం చేసుకోవడంపై ఫోకస్ పెట్టింది. మిషన్ అన్వేషణ్ పేరుతో క్రూడాయిల్ నిక్షేపాల వేట మొదలుపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో కడా మిషన్ అన్వేషన్ పేరుతో సహజవాయు నిక్షేపాల కోసం సర్వే చేస్తున్నారు.ఏపీలోని విజయనగరం జిల్లా భోగాపురం నుంచి కాకినాడ జిల్లా పెద్దపురం వరకు.. మళ్లీ అక్కడి నుంచి కృష్ణా జిల్లా మచిలీపట్నం వరకు మిషన్ అన్వేషన్‌లో భాగంగా తొలి విడతలో సర్వే



చేపట్టారు. ఈ సర్వేను ఓఎన్‌జీసీ, ఆల్ఫా జియో సంస్థ కలిసి ఉమ్మడిగా చేస్తున్నాయి. శాటిలైట్ ద్వారా సర్వే చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సర్వే కొనసాగుతోంది. అనకాపల్లి జిల్లాలో మండలాల్లో సర్వే చేస్తున్నారు.. సహజవాయు నిక్షేపాలను గుర్తించేందుకు నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, మునగపాక మండలాల్లోని పంట భూముల్లో 60 అడుగుల లోతులో డ్రిల్లింగ్ చేస్తున్నారు.ఈ భూముల్లో డ్రిల్లింగ్ చేసి.. మొదటి పది అడుగుల్లో వారికి అవసరమైన మట్టి నమూనాన సేకరిస్తున్నారు. అలాగే నీటి లభ్యత, సహజ వాయు నిక్షేపాలకు సంబంధించి అవసరమైన మరికొన్ని పరీక్షలు కూడా నిర్వహిస్తారు. ముందుగా 2డీ సెస్మిక్ సర్వేలో భాగంగా కేబుళ్లు ఏర్పాటు చేశారు.. ఇలా డ్రిల్లింగ్ చేసి భూమి నుంచి సేకరించిన మట్టికి సంబంధించిన శాంపిల్స్‌ను డెహ్రాడూన్‌కు పంపించారు. మరికొన్ని శాంపిల్స్‌ను ఓఎన్‌జీసీ ల్యాబ్స్‌కు పంపించారు. ప్రస్తుతం ప్రాథమికంగా సర్వే చేస్తుండగా.. ఆ తర్వాత మరో రెండు విడతలుగా డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. ఒకవేళ ఈ సర్వేలో ఎక్కడైనా సహజవాయు నిక్షేపాలను గుర్తిస్తే ఆ సమీపంలో రెండు ఎకరాల భూమిని లీజు కింద తీసుకుంటారు. మిషన్ అన్వేషణ్ పేరుతో చేపట్టిన ఈ సర్వేను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయాలని ప్లాన్ చేశారు.

# మదనపల్లె ఫైల్స్ కేసులో కీలక పరిణామం పెద్దిరెడ్డి పీఏ, అనుచరుడు అరెస్ట్

మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ముని తుకారాం, మాధవరెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ముని తుకారాం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించారు. అలాగే మాధవరెడ్డి.. పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు. మాధవరెడ్డి, ముని తుకారాం.. మదనపల్లె ఫైల్స్ కేసులో ఏ3, ఏ4గా ఉన్నారు. వీరిద్దరూ బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండలంలోని పనపాకం టోల్‌ప్లాజా వద్ద సీఐడీ అధికారులు వారిద్దరినీ బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తిరుపతి సీఐడీ ఆఫీసుకు తరలించారు. 2024 జులై 21వ తేదీన మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనలో ముఖ్యమైన పలు రెవెన్యూ ఫైఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ల్స్ కాలిపోయాయి. అయితే ఇది ప్రమాదం కాదని.. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటనగా అనుమానిస్తూ పలు అభియోగాలు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే మాజీ మంత్రి పెద్దిరెడ్డి



రామచంద్రారెడ్డి అనుచరులే ఈ ఘటనకు కారణమనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఘటన జరిగిన సమయంలో మదనపల్లె ఆర్డీవో ఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్, హరిప్రసాద్‌లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మదనపల్లె ఆర్డీవోగా గతంలో పనిచేసిన మురళి అనే అధికారిపైనా చర్యలు తీసుకుంది. అనంతరం 2024 ఆగస్టు నెలలో మదనపల్లె ఫైల్స్ కేసును ఏపీ ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించింది. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు గౌతమ్ తేజ్, పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి, మురళిలను అరెస్ట్ చేశారు. అయితే కొన్ని కారణాలతో మాధవరెడ్డికి కోర్టు.. రిమాండ్ విధించలేదు. దీంతో ఆయన బయటే ఉన్నారు. అలాగే ఈ కేసులో ఏ4గా ఉన్న ముని తుకా ఓరాం.. గతేడాది జులైలో అమెరికాకు వెళ్లిపోయారు. బుధవారం రోజున వీరిద్దరూ ఎం టోల్‌ప్లాజా వద్ద కాఫీ తాగేందుకు రాగా సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# ఏపీలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం.. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం,

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకం ప్రారంభమైంది. గుంటూరు జిల్లా మంగళగిరి బస్టాండ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ కలిసి ప్రారంభించారు. అనంతరం ముగ్గురు నేతలు దివ్యాంగులతో కలిసి పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. మంగళగిరి డాన్‌బాస్కో స్కూల్ మీదుగా డోలాస్ నగర్, ప్రకాశ్‌నగర్, నులకపేట, ఉండవల్లి సెంటర్ మీదుగా పెనుమాక వరకు ప్రయాణం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి దివ్యాంగుల్ని అడిగి తెలుసుకున్నారు.దివ్యాంగ శక్తి పథకం పేరుతో ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అందిస్తోంది ప్రభుత్వం. అందరికీ సమాన అవకాశాలు అందించేలా దివ్యాంగుల ప్రయాణాన్ని సులభతరం చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపేలా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ దివ్యాంగ శక్తి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణించొచ్చు. వీటిలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులు ఉన్నాయి. మొత్తం 21 కేటగిరీల్లో 40 శాతం కంటే



ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయొచ్చు. దివ్యాంగులతో పాటుగా వారి వెంట వచ్చే సహాయకులతో కలిపి 12.76 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. ఈ దివ్యాంగ శక్తి పథకం కోసం ఏపీ ప్రభుత్వం ఏటా రూ.207 కోట్లు ఖర్చు చేయనుంది.వ్యాంగులు గతంలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో 50 శాతం ఛార్జీతో ప్రయాణించేవారు. కొత్తగా దివ్యాంగ శక్తి పథకం అమల్లోకి రావడంతో ఉచితంగా ప్రయాణిస్తారు.. వీరికి జీరో ఫేర్ టికెట్ జారీ చేస్తారు. అయితే ఆర్టీసీలో మిగిలిన బస్సులైన నాన్ స్టాప్, ఇంటర్ స్టేట్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు 50 శాతం రాయితీ కొనసాగుతుంది. అంతేకాదు దివ్యాంగ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు పాస్‌ల సాయంతో ప్రయాణం చేయొచ్చు. ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లలో వీటిని జారీ చేస్తున్నారు. గతంలో 50శాతం రాయితీ వర్తించే పాస్ ఉన్నవాళ్లను గడువు ఉన్నంత వరకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తారు. కొత్తగా పాస్ తీసుకోవాలంటే సదరం పత్రం, ఆధార్ కార్డు కావాలి. మొబైల్ యాప్, మనమిత్ర ద్వారా డిజిటల్ పాస్ తీసుకోవచ్చు. అయితే దివ్యాంగుల వెంట సహాయం కోసం వెళ్లేవారికి ఐదు రకాల బస్సుల టికెట్ ఛార్జీలో 50 శాతం రాయితీ అందిస్తోంది ప్రభుత్వం.

# చంద్రబాబు మార్క్ పాలిటిక్స్ తప్పు చేస్తే ఎంపీనైనా ఉపేక్షించేది లేదు!

**ఏలూరు:** ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ తీరుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎంపీ చేసిన తప్పు వల్ల పార్టీ మొత్తం సమాధానం చెప్పుకోవాల్సి రావడం దురదృష్టకరమని ఆయన మండిపడ్డారు. తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణ తప్పేవారు ఎంతటి వారైనా సరే, వారిని భరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.యువతకు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేశారు..2024 ఎన్నికల్లో యువతను ప్రోత్సహించాలనే మంచి ఉద్దేశంతో మహేశ్ యాదవ్‌కు ఎంపీ సీటు ఇచ్చి గెలిపించుకున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. కానీ, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి డ్రగ్స్



వంటి వివాదాల్లో చిక్కుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మంచి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చి కూడా ఇలాంటి పనులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వారు తమకు వచ్చిన గొప్ప అవకాశాన్ని ఇలాంటి దురలవాట్లతో పాడు చేసుకోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.క్రమశిక్షణే ముఖ్యం: ఎవరికీ మినహాయింపు లేదుతెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ అనేది అం దరికీ సమానమేనని, ఎవరికీ ప్రత్యేక వెసులు బాటు ఉండదని చంద్రబాబు తేల్చి చెప్పారు. గతంలో కూడా తప్పు చేసిన వారిపై కఠిన నిర్ణయాలు తీసుకున్నామని, ఇప్పుడు కూడా అదే పంథా కొనసాగుతుందని హెచ్చరించారు. తప్పులు చేస్తూ పార్టీకి నష్టం కలిగించే వారిని మోయాల్సిన అవసరం పార్టీకి లేదని ఆయన కచ్చితంగా చెప్పారు. నాయకులందరూ క్రమశిక్షణతో మెలగాలని, ప్రజల్లో పార్టీ గౌరవాన్ని పెంచేలా ప్రవర్తించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

# దివ్యాంగ శక్తి' పథకంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు

**శ్రీకాకుళం, మార్చి 18:** రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఇటీవల ప్రారంభించిన 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా దివ్యాంగులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణస్తూ ఎంతో లబ్ధిపొందుతున్నారన్నారు. చరిత్రలో దివ్యాంగులకు ఎప్పుడు మేలు జరిగినా అది సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక గౌరవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం అద్భుత విజయాన్ని అందుకుంది. అదే బాటలో ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' సూపర్ హిట్ అవుతుంది. ఇప్పటివరకు దాదాపు 150 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా



ప్రయాణించారంటే ఈ పథకం ఎంతటి ఘన విజయం సాధించిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో మొత్తం 12.70 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. ప్రస్తుతం 2 లక్షల మంది మాత్రమే పాస్‌లు కలిగి ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 42 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వారందరికీ పాస్‌లు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం బస్ స్టేషన్లలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, వంద శాంతం మందికి పాస్‌లు అందజేసేలా ప్రక్రియను సరళీకరణ చేస్తాం' అని అన్నారు.

# దేశ నలుమూలలా శ్రీవారి వైభవం ముంబయి ఆలయానికి రూ.5.12 కోట్లతో స్వర్ణ కవచాలు


**తిరుపతి :** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవం దేశ నలుమూలలా విస్తరిస్తోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు, రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి రంగంలోకి దిగింది. ముంబయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న శ్రీవారికి రూ.5.12 కోట్లతో స్వర్ణ కవచాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల్లో సైతం స్థలాల సేకరణ పూర్తి చేసి, ఆలయ నిర్మాణాలకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ బృహత్తర ప్రాజెక్టులకు సంబంధి



ంచిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ముంబయి శ్రీవారికి స్వర్ణ కవచాలు : మహారాష్ట్రలోని నవీ ముంబయి (ఉల్వే ప్రాంతం)లో పది ఎకరాల్లో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. రేమండ్ గ్రూప్ చైర్మన్ గౌతమ్ సింఘానియా రూ.100 కోట్ల భారీ విరాళంతో దీన్ని కట్టిస్తున్నారు. ఇప్పటికే రూ.75 కోట్లతో 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో ఈ ఆలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ గుడిలోని మూలవిరాట్టుతో పాటు, ఉప ఆలయాల్లోని దేవతామూర్తులకు స్వర్ణ కవచాలు వేయాలని టీటీడీ నిర్ణయించింది. దీనికోసం మొత్తం రూ.5.12 కోట్లను మంజూరు చేసింది. మెటీరియల్ కోసం రూ.4.90 కోట్లు, తయారీ కూలీ కింద రూ.22 లక్షలు ఖర్చు చేయనున్నారు. టీటీడీ ఖజానా నుంచి 3 కిలోల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం, 125 కిలోల రాగి రేకులను ఈ కవచాల తయారీకి వినియోగించనున్నారు.దేశవ్యాప్తంగా కొత్త ఆలయాలు ఇవే : వివిధ రాష్ట్రాల్లో కొత్త ఆలయాల నిర్మాణానికి టీటీడీ ప్రతిపాదనలు ఆమోదించింది. టీటీడీ చైర్మన్ లేఖ రాయడంతో బీహార్ ప్రభుత్వం సానుకూలంగా స్పంది ంచింది. పట్నా జిల్లా మోకమాలో 10.11 ఎకరాల భూమిని 99 ఏళ్ల పాటు, ఏడాదికి కేవ లం రూపాయి నామమాత్రపు లీజుతో ఇచ్చే ందుకు అంగీకరించింది. తమిళనాడు రాష్ట్రం ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 19.62 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చింది.

# మాజీ మంత్రి కరారి ఈశ్వర్ ఇంట్లో చోరీ పోలీసుల దర్యాప్తు

**కృష్ణా జిల్లా, మార్చి 18:** మాజీ మంత్రి కరారి ఈశ్వర్ కుమార్ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగులగొట్టి దుండగుడు చోరీకి తెగబడ్డాడు. కరారి భార్య మధురిమ రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి బుధవారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించారు. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీలో



వంశపారంపర్యంగా వస్తున్న సుమారు 10 కిలోల వెండి వస్తువులు, పూజా సామాగ్రి అపహరణకు గురయ్యాయని తెలుస్తోంది.వెంటనే గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు మధురిమ ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్ టీంకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన క్లూస్ టీం ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. కరారి ఈశ్వర్ కుమార్ వ్యాపారం రీత్యా హైదరాబాద్, బెంగళూరులో ఉంటున్నారు. చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

